# అనుమానము

ముళ్ళపూడి సర్వేశ్వరరావు

రామారావు పట్టి అనుమానంమనిషి ఏపని చేస్తున్నా తన బుద్ధిమాత్రము యింటిచూరు లోనే యుండేది. అతనికి అంత అనుమానం యెలావచ్చిందంటే ఆయూళ్లో యెక్కువమంది షోకేలాగ్లాళ్ళున్నారన్న సంగతి బాగుగా తెలుసు. దానికితోడు తను క్రొత్తగా కాపురం పెట్టాడు తనులేనప్పుడే తుంటరి వెధవైనా యింట్లో జొర బడి భార్యని యేం అల్లరి చేస్తాడో అన్నభయం అతనికెక్కువగా యుండేది అంతేకాక స్వతాహా తనతాత ముత్తాతలనుంచీ వంశపారంపర్యంగా వస్తున్న అనుమాన పిశాచము వదలలేక కాబోలు యితనినికూడ వరించింది. పితృదేవతలే ఆస్తి యితనికొరకుంచలేదుగాని యీ అనుమాన పిశా చమునుమాత్రము దిట్టంగా యితనిలో ప్రవేశ పెట్టిపోయారు.

సంవత్సరమాఖరగుటవలన ఆఫీసులో పని యొత్తిడి యెక్కువగుటవల్ల రాత్రి పది గంట లలోపుగా యింటికిచేరుకొనే అవకాశము పాపం రామారావుకి కలుగలేదు. పోనీ యేదో మిషపెట్టి పోదామా అంటే పై అధికారి ఉద్దండపిండం. కాఫీనీళ్ళు త్రాగడానికైనా పర్మిషను కావాలి. ఎలాగో ఓపికపట్టి తప్పనిసరిగా అపనిని చేస్తు న్నాడుకాని మనసుమాత్రం సరిగాలేదు.

ఆనాడు పాపము రామారావు మనస్సును మరి అదుపులోయుంచలేక పోయేడు. పని చేయ డానికి యిష్టపడలేదు. ఎంతత్వరలో యింటికి పోదామా అన్నఆలోచన తప్ప యింకేమియు అతని బుర్రలో పనిచేయలా ఎలాగైతెనేం? ఏదో అవుకుచెప్పి యజమాని దగ్గర శలవుతీసు కొని యెనిమిది గంటలకు యింటికి బయలు దేరాడు త్రోవలోతెలిసినవాడెవడైనా కనబడుతే ఆలస్యమవుతుందని అడ్డుత్రోవద్వారా యింటికి చేరాడు. అనుమానం పిడుగని మొదటే తెలుసు.

మెల్లగా తలుపుదగ్గరకు వెళ్ళి తట్టబోయేసరికి లోపల తనభార్య యెవరితోనో మాట్లాడుతున్నట్లు మాటలబట్టి గ్రహించాడు. ఇహ అతని యీహ లకు అంతులేదు. "వాడెవడు? వాడితో నాపెళ్లాం యెందుకింత చనువుగా మాట్లాడుతున్నది?" ఎన్నాళ్ళనుండీ వీళ్ళిద్దరికి యీ సంబంధముంది! అన్నప్రశ్నలతన నుద్రేకపరచుచుండెను తన భార్యతన్ను మనస్ఫూర్తిగా ప్రేమించుచున్నదని తెలుసుకొని "స్త్రీబుద్ధి చంచలమన్న" వాక్యము అతనికి స్ఫురణకురాగా మరల మనస్సులో తన భార్యయందు అసహ్యతపుట్టెను. ఇలాంటి ఆలో చనతో అతని బుర్ర వేడెక్కి వారిద్దరిని అవ శంగా ఖూనీచేస్తేనేకాని తన మనస్సు శాంతవడ దనుకొన్నాడు. ఆ తలుపు సందుగుండా పురుష విగ్రహమును బాగాగుర్తు పెట్టుకొన్నాడు. ఇరు వదియైదేండ్ల ప్రాయముగల యువకుడు. తన భార్య ప్రక్కలోకూర్చుండి నవ్వుతూ యేమేమో మాట్లాడుతుండడముచూచియే భర్తయూరుకొన గలడు. భర్తయెంత చవటవాడైనా యిట్లు పురు షునితో సంతోషసాగరమునమునుగుటన్యాయమా రామారావుదగ్గర ఆసమయమున పిస్తోలుంటే యేమిచేసేవాడో.

అంతవరకూ తలుపుతలుపునుంచి పళ్లు పటపట కొరుకుతున్నాడేకాని వారేమి మాట్లాడుతున్నారో వినపడడంలేదు. వారినవ్వులుచూస్తుంటే యిత నికి పుట్టిన వెర్రికి అంతులేదు. కొంత సేపటికి నవ్వుచాలించి ఆ యువకుడేదోచెప్పి తలుపు తీసు కొని వెళిపోయినాడు. "రాత్రి యొంటిగంటకు వస్తాను" అని అతడు పోతూ పోతూ పలికిన ఆ రెండు వినీ వినిపించని ముక్కలుమాత్రము రామారావు గుండెలో శూలాల్లా గుచ్చుకొన్నాయి. వీరిద్దరు కలసి తన్నేదో ద్రోహము చేయబూనే రని తలంచి ఆనాడురాత్రి యొంటిగంటకు యెలాగైనా వీరిద్దరిపని పట్టించెదనని తన మన స్సులో నిశ్చయించుకొనెను.

ఏమీ యెరుగనివాడివలె పెరటింట్లోంచివచ్చినవాడల్లా వీధివేపు తిరిగి గుమ్మందగ్గరకు వెళ్ళి తలుపు తట్టే సరికి భార్యవచ్చి తలుపుతీసింది. తలుపుతీయడమే తడవుగా ఆమెను త్రోసుకుంటూ చురచురచూస్తూ తన గదిలోనికిపోయి కోటువిప్పి పారవేసి మంచముమీద బోర్లా పడుకున్నాడు. భార్యలోనికిపోయి కాఫీకలిపి తీసుకొనివచ్చి మెల్లగా అతని దగ్గరకువెళ్ళి ఆప్యాయంగా "కాఫీ చల్లారిపోతుంది త్రాగండి" అంది.

"కాఫీ- గీఫీ- యేమీవద్దు. ఫో! వాడొచ్చినప్పుడు రాత్రే కాఫీ యిద్దువుగానివే" అని కోపంతో పడుకొనే అన్నాడు.

"వాడెవడండీ! మీకేం పిచ్చిపట్టిందేంటి" చల్లారిపోతుంది కాఫీ తీసుకోండి మరల అంది.

వాడెవడు! నీ మిండగాడు. ఆవెధవనాకుపిచ్చా నీకు పిచ్చా! సిగ్గు లజ్జాలేక యింకా యెవడని అడుగుతున్నావు ఫో! నా ముందునుంచి' ఈ యొక్కతోపుతోసేసరికి ఆకాస్తా కాఫీ ఒలికిపోయింది.

పాపం అతనిమాటవిమెకర్థమవలా! నిజంగా ఆమె నిర్దోషి. కాని తన భర్తమాత్రం పట్టి అనుమానం మనిషని ఆమెకు తెలుసు. అతనిలా నానాతిట్లు తిడుతుంటే పాపం ఆమెకళ్ళవెంట నీళ్లు ముత్యాలులా జలజలా రాలుచుండెను కాని రామారావు హృదయంమాత్రం కరుగలేదు. ఇదోవేషంకాబోలు అని అతడు పళ్లు పట పట కొరుకుతూ "ఇంకా యిప్పుడుకాదు ఇంకా కొంచెము టైముంది- ఇవాళనీ అంతేదో కనుక్కుంటాను ఆవెధవని, నిన్ను చంపేస్తేగాని నా మనస్సుకు శాంతిలేదు." అని కోపముతో అంటుంటే ఆమె వెక్కి వెక్కి యేడుస్తూ "వాడెవడండీ! నిజంగా నేనే పాపమెరుగను- మీ అనుమానమే మనకొంప కాలుస్తున్నట్లుంది" అని యేడుస్తునే అంది

"అనుమానమా! ఇంకా సిగ్గులేదూ! కల్ల బొల్లి యేడుపులకు లొంగిపోతాననుకున్నావా? యింత సేపూ పక్కనకూర్చోబెట్టుకొని సరసా లాడుతుంటే నేను చూడలేదనుకొన్నావా? ఇప్పటితో యింకాచాలక మళ్లీ రాత్రియొంటిగంటకి రమ్మనలేదూ? ఆవెధవని! ఎలా వస్తాడో రానీ-యివాళ! వాడిని ఖూనీ చేయకమానను- వెధవ ఎన్నాళ్లనుండీ యిలా వస్తున్నాడో ఇవాళ వాడి అంతు తెలుసుకోంగే నాకు నిద్రపట్టదు." ఈ గుక్క తిప్పుకోకుండా యుద్రేకంతో అంటుంటే అంత వరకూ యేడుస్తున్నదల్లా పక్కునయొక్క నవ్వు నవ్వింది

దాంతో ఆయనకు అగ్గిమీద గుగ్గిలమన్నట్లు మరింతకోపమొచ్చి "ఓసీ రంకులాడీ! ఇంకా సిగ్గులేక నవ్వుతున్నావే!" ఈ తిట్టడం ఆరంభించేడు.

ఆమె ఆలా నవ్వుతునే "రాత్రియొంటిగంటకు ఆ వచ్చేవాడిని తొందరపడి చంపకండేం దీనికేనా యింత అనుమానం మీ అనుమానం బంగారుకానూ! ఇందాక మీరు చూచినవాడు మా పెదతమ్ముడు ఇంతకుముందెప్పుడూ మీరు చూడలేదు గాబోలు పట్నంలో బి యస్ సి. చదువుకొంటున్నాడు శలవులలోయింటికివెడుతూ యిక్కడోపూట దిగుదామని నిశ్చయించి యివాళే వచ్చేడు. మీ కోసం యెనిమిది గంటల వరకూ చూచి యింకా రాకపోవుటచే యేమీ తోచక అలా సినిమాకు వెళ్లాడు. రెండో ఆట అఖరయేసరికి యొంటిగంట అవుతుంది అందుకే సినిమాచూసి యొంటి గంటకు మళ్ళా వస్తానన్నాడు" అని గుక్కతిప్పకోకుండ విరగబడి నవ్వుతూ జవాబిచ్చేసరికి రామారావు ఒళ్లు చల్లబడింది. అలానే కుర్చీలో చతికిల పడ్డాడు. కాని అనుమానంమాత్రం యొకవంక బాధిస్తునేయుంది. ఎలాకవుతేనేం మళ్లీ వస్తాడుకదా అప్పుడేవాడిని చూద్దాము ఈ యెదురు చూస్తూ అలా కుర్చీలోనే వేరబడ్డాడు.

"ఏం బావా! వెధవపనిరాత్రి ఎనిమిదిగంటల వరకూనా'' ఈ అవేసరికి అంతవరకూ ఆలోచిస్తున్న రామారావు గతుక్కునలేచి అతనివంక చూచు సరికి యిందాకటి విగ్రహమే యెదురుగా యుండుటచే మరిమాటాడలేకపోయాడు. కత్తిపేటులైనా ముఖాన నెత్తురు చుక్కలేకుండా పారిపోయింది. నిష్కారణంగా భార్యపై అనుమానపడ్డానుగదాయని తరువాత విచారించేడు. ఆనాటినుంచీ అతనిలో సగమనుమానము పటాపంచలై పోయింది.